


మల్లంపల్లి కృష్ణారావు

రాణి మందాకినీదేవి గవాక్షం గుండా తన దృష్టిని సారించి చూస్తోంది. నిన్న వికసించి, పరిమళాలని వదిలిన పువ్వులన్నీ వాడిపోయి, సౌకుమార్యాన్ని కోల్పోయి రాలిపోతున్నాయి. వాటిలో చాలా

పువ్వులు ఫలించకపోవచ్చు. తుమ్మెదల ద్వారా వాటి ప్రాథమిక కర్తవ్యాన్ని లేదా హక్కుని అనుభవించే అవకాశాన్ని అవి దూరం చేసుకుని ఉండచ్చు. రాణి చిన్న నిట్టూర్పు విడిచింది. ఈ రోజంతా ఆమె ఉచ్ఛ్వాస, నిశ్వాసాలన్నిటినీ ఇలాంటి నిట్టూర్పులే నింపివేశాయి. తన బ్రతుకు కూడా ఆ 'అవకాశం' దొరకని ఏదో ఒక చిన్న పువ్వు వంటిదనే అనుమానం కల్గిందామెకు. మళ్ళీ ఒక నిట్టూర్పు విడిచి దగ్గరలో ఉన్న ఆసనంమీద కూర్చుంది.

వంశప్రకారం దశరథమహారాజు ఈ 'రాత్రి' తన అంతఃపురానికి వస్తాడు. ఈ రాత్రేనా? అంతేనేమో! కాకపోవచ్చు కూడా! ఈ అంతఃపురమూ, ఈ గవాక్షం, ఈ ఆసనం తన జీవితంలో కాల ప్రవాహాన్ని అరికట్టి యాంత్రికంగా తయారు చేశాయి. ఎప్పుడో చాలా ఏళ్ళ క్రితం దశరథమహారాజు ఈ అంతఃపురానికి వచ్చిన తర్వాత తన జీవితంలో చెప్పుకోదగ్గ బలమైన సంఘటన ఏదీ లేదేమో! రోజూ నిద్రనుండి లేవడం, కాలకృత్యాల తర్వాత చెలికత్తెలు సుగంధాలతో స్నానం చేయించడం, భోంచెయ్యడం, నిద్రపోవడం కాకుండా, చెలి తగ్గు స్వరంలో వాయిద్యం వాయిస్తూండగా ఈ ఆసనంలో కూర్చొని, ఈ గవాక్షం గుండా పువ్వులని, ముఖ్యంగా రాలిపోతున్న పువ్వులని, తోటద్వారాన్ని కాపలా కాస్తున్న ఆ బలిష్ఠుడైన ద్వారపాలకుణ్ణి చూడడం తప్ప ఏ రోజులోనైనా ఇంకో కొత్తది, కదిలించేదీ అయిన సంఘటన లేదేమో! లేకేం! ఈ రెండేళ్ళలోనూ ఒక రోజున, ఆ ఉదయం గవాక్షంగుండా చూస్తోంది తను. తోటలో పువ్వులు కోయడానికి ఓ చెలికత్తె వెళ్ళింది. తను రోజూ చూసే ఆ బలిష్ఠుడైన ద్వారపాలకుడు ఆమెకేసి చూసి చిరునవ్వు నవ్వాడు. ఆ నవ్వులో ఎంతో చిలిపితనం, ఉత్సాహం ఉండి ఉంటాయి. చెలికత్తె కందని ఏదో చెట్టుకొమ్మన పువ్వుని ఎగిరి కోసి ఆమె సిగలో తురిమాడు. చెలికత్తె సిగ్గుపడింది. వెంటనే అటు యిటూ చూసి అతడు ఆమెను పొదివి పట్టుకుని, చుంబిస్తూ, చెట్టు పక్కగా తీసుకెళ్ళిపోయాడు. తర్వాత జరిగే విషయాన్ని కన్పడకుండా ఆ చెట్టే మందాకినీదేవికి అడ్డువచ్చి దాచేసింది. ఆనాడు ఆ జరిగేదేమిటో చూడాలనే ఉద్రేకానికి, అందుకు శతవిధాల ప్రయత్నించినపుడు తన మానసిక బలహీనతకి ఎంతగా సిగ్గుపడిపోయింది తను. ఆ సంఘటన చూసిన తన మనస్సు ఎంత ఆందోళన పడింది. ఆసనంలో కూలబడి తను కన్నీరు కార్చింది. ఆ సంఘటన తనని మానసికంగా దెబ్బకొట్టడానికి, హేళన చెయ్యడానికే ఉద్దేశించబడినట్లుగా తను బాధపడింది. చెరగని

ముద్ర వేసింది. అతనెంత బలంగా ఆమెని కౌగలించుకున్నాడు. ఎంత బలంగా చుంబించాడు. కాని అతను చేసిన ఈ ఏ క్రియలోనూ తను పాల్గొనలేదనే విషయం తన్నెంతో కలవర పెడుతోంది. ఈ ప్రపంచంలో అందరికీ సామాన్యమైన ఈ మధుర సంఘటన తనకెంత అపురూపమైపోయింది. అయినా యీ రాత్రైనా దశరథ మహారాజు వస్తాడేమో!

'రాణీ మందాకినీదేవి తమ భోజనానికి వేళైంది' చెలికత్తె వినయం నటిస్తూ చెప్పింది.

'ఈ వేళ శరీరంలో బాగుండలేదు భోజనం చేయను. తలుపువేసి ఎవర్నీ రానివ్వకు' అని సమాధానం చెప్పింది రాణి.

తను శాఖిలీ రాజ్యానికి రాజైన వీరేంద్రుని కూతురు. తన పదిహేను సంవత్సరాల జీవితాన్ని శాఖిలీరాజ్య అంతఃపురంలోనే గడిపింది. అప్పుడు కూడా అంతఃపురంలోనే అయినా, వినోదాలలోనూ, ఆటపాటలలోనూ మునిగి పోయేది. తన తల్లిదండ్రులను చూదిన క్షణాలు తనకి బహు తక్కువ. తనకి జ్ఞానం వచ్చిన తర్వాత, తల్లికి దూరంగా వేరే ఉండే ఏర్పాట్లు జరిగాయి. తనకి ఆరోగ్యం బాగుండనపుడో, యిలాంటి మరో కారణం వల్లో తన తల్లి వచ్చి చూసి వెళుతూ ఉండేది. తన తండ్రిని చూసిన క్షణాలు ఆమెకు మరీ తక్కువ. ఒక రోజు మాత్రం తనకి బాగా జ్ఞాపకం ఉంది. చెలికత్తె వచ్చి తనని తన తల్లి అంతఃపురానికి తీసుకు రావలసిందిగా నాన్నగారు కబురు చేశారని చెప్పింది. (ఆ రోజు వంతుప్రకారం నాన్నగారికి తన తల్లి దగ్గరకు వచ్చే రోజయ్యుంటుంది) తను రాజసన్నిధానంలో వేసుకొనవలసిన దుస్తులు ధరించి తన తల్లి అంతఃపురానికి వెళ్ళింది. తన తల్లి, తండ్రి ఆసనంమీద కూర్చుని ఉన్నారు. ఆరోగ్యం గూర్చి పరస్పరం సంభాషించుకున్న తర్వాత నాన్నగారితో తల్లి ఇలా అంది 'యువరాణికి యుక్తవయస్సు వచ్చింది, సంబంధాలు చూడండి.'

'నిజమే, గుర్తు చేశావు. అప్రయత్నంలో వుండమని మంత్రిని రేపే ఆజ్ఞాపిస్తాములే' అన్నారు నాన్నగారు.

తను సిగ్గుపడుతూ వచ్చేసింది. రాజాంతఃపురాల్లో ఇలాంటి సంభాషణలు తప్ప వేరే ఉండక పోవడం వల్ల తల్లి అభిమానం తనికి వెంటనే అర్థమయింది. తను ఇంకో విషయం ఏది అర్థం చేసుకోలేదేమో కూడా.

ఓనాడు చెలికత్తె వచ్చి నవ్వుతూ, హేళనగా తనకి చెప్పింది. తన తల్లి తండ్రిగారితో యిలా అందిట 'యువరానిణి వినోదానికి ఇతగా ఎవరైనా పంపించండి. ఈ మధ్య ఏదోలా ఉంటోంది. స్వయంవరం ఏర్పాట్లు చేస్తున్నారా ?'

'స్వయంవరానికి ఈ పరిస్థితుల్లో వీలుండదు. మనం దశరథ మహారాజుతో యుద్ధంలో ఉన్నాం. ఈ లోపుగా మనకు యుద్ధ ఖైదీ అయిన శాక్తేయ రాకుమారుణ్ణి పంపిస్తాం' అన్నారుట నాన్నగారు.

ఏ విషయంలో తను గోప్యంగానూ, రహస్యంగానూ ఉండదలుచుకుందో, ఆ విషయాలు తన తల్లిదండ్రులు, ఇంత సాధారణంగా, చెలికత్తెలు వినేలా ఎలా మాట్లాడుకుంటారో తన కర్థంకాలేదు. శాక్తేయ రాజకుమారుణ్ణి తను రాజప్రాసాదంలో ఖైదీగా తీసుకు వచ్చినపుడు తెరల మరుగునుండి చూసింది ముప్పై ఏళ్ళకు పైగా ఉంటాయి. అతని కూడా అతని భార్య, యిద్దరు పిల్లలు కూడా ఉన్నారు. ఖైదీలమీద జుగుప్స, చులకన కలిగించుకోడం సహజమైన రాజవంశీకుల్లాగే తనూ నిర్లక్ష్యంగా చూసింది. అతడు తనకి ఏవిధంగా ఇతగా అవుతాడని తల్లిదండ్రులు అనుకున్నారో అర్థం కాలేదు. ఇదట్లా ఉంచి రాజకుమార్తె అయిన తనకి తన దేశం దశరథునితో యుద్ధంలో ఉన్నదన్న విషయం అప్పుడే తెలిసింది.

కొన్ని రోజులకి, శాక్తేయ రాజకుమారుడు తన అంతఃపురానికి రాకముందే, దశరథుడు యుద్ధం గెల్చుకున్నాడు. తన తండ్రి యుద్ధంలో చంపబడ్డాడు. తల్లి వెంటనే విషం తాగి మరణించింది. దశరథుడు అంతఃపురంలోని చాలా మందిని ఖైదీలుగా పట్టుకున్నాడు. తనని పెళ్ళి చేసుకున్నట్టు ప్రకటించాడు. పెళ్ళిలాంటిది జరగకపోయినా, కన్యాదానం చెయ్యవలసిన తల్లిదండ్రులు చనిపోవడం వల్ల, ఓడిన రాజవంశ స్త్రీలను అనుభవించే హక్కు ఉన్నదనే సూత్రం వల్ల తను అతని భార్యగా ప్రకటింపబడింది. తను దశరథుని అంతఃపురానికి తరలింపబడింది.

ఇంత జరిగినా తను దశరథుని చూడలేదు. దశరథుని అంతఃపురానికి వచ్చిన తర్వాత అతని వందల భార్యలలో తను ఒకర్తె అయిన విషయం, దశరథుడు కోరికలు ఉడిగిపోయే ముసలితనంలో ఉన్నవాడన్న విషయం తెలిశాయి. తనకి యింకా అప్పటికి పదిహేనవ ఏడు నిండలేదు. పైగా తన వంశం అనాగరికమైనదని దశరథుని వంశం భావించేది.

యుద్ధంలో గెల్చిన తర్వాత రాజ్యంలో వేడుకలు, రాజప్రాసాదంలో విందులు, దశరథునికి జయ

జయధ్వానాలు లాంటిసంరంభాలన్నీ అయిన తర్వాత దశరథుడు ఓ రోజు తన అంతఃపురానికి వస్తాడన్న విషయం తెలిసింది. ఆ రోజంతా చెలికత్తెలు అలంకరణలతో తనని, అంతఃపురాన్ని వెలిగించేశారు. ఈ ప్రయత్నాలన్నీ తన జీవిత పరమావధేదో యీ రోజు తనను వరిస్తోందని, జీవిత సాఫల్యాన్ని అంతనీ కానీ రోజు కౌగలించుకోబోతోందనే అభిప్రాయం అంతఃపురంలో కల్గించి తన లోనూ కొంత వరకు ఉత్సాహం కల్గించాయి.

దశరథుడు తన అంతఃపురానికి వచ్చాడు. వస్తూనే 'శాథీలి వంశ రాజకుమారివి కదూ' అని తన్నడిగాడు. ఆ ప్రశ్న ఎంత అర్థరహితమైనది? అతని ఆగమనంలో తానాశించిన ప్రత్యేకతగానీ, ఉత్సాహంగానీ ఏం లేదా? తనెవరో తెలియకుండా ఏం చేద్దామని వచ్చాడో?

'అవును' తను సమాధానం చెప్పింది.

దశరథుడు తనని దగ్గరకూర్చోపెట్టుకున్నాడు. తన నాన్నగారి దగ్గర కూర్చోటానికీ, దీనికీ ప్రాథమికంగా ఉద్దేశంలోనే భేదం ఉండవచ్చుగానీ, అలాంటి ఉద్దేశమే తనకి చంపుకుందామన్నా ఏర్పడిపోయింది. దశరథుడు నాన్నగారికంటె చిన్నవాడు కూడా కాదు. శారీరకంగా అతనిపైన రాజాభరణాల ఆర్భాటం తప్ప ఉన్నతమైనదేదీ అతనిలో తనకి కన్పించలేదు. దశరథుడు తనని లాలిస్తూ సంభాషణలనారంభించాడు. అందులో తనపై ప్రేమని (యిది అసాధ్యమయినా) వ్యక్తపరచే ఉద్దేశం లేకుండా, తను రాజ్యాన్ని గెల్చుకున్న అతిశయం, ఇందుకోసం అతని మహోన్నతత్వానికి తాను చూపవలసిన కర్తవ్యం అనే భావం అతని సంభాషణలో వ్యక్తమయ్యాయి. చాలా రాత్రయింది. వింటూ అతని ఒడిలోనే నిద్రపోయింది తను. కాస్సేపటికి అతను లేపి 'చిన్నపిల్లవు సుమా! అయినా ఫర్వాలేదు' అంటూ దగ్గరకు లాక్కున్నాడు.

తెల్లారి తను లేస్తుండగానే దశరథుడు తన దుస్తులు, ఆభరణాలు ధరించి వెళ్ళిపోతున్నాడు. వెళ్తూ 'నే వెళ్తున్నాను. తిరిగి మరుపటి సంవత్సరంలో యిదే రోజున వస్తాను.' అంటూ వెళ్ళిపోయాడు.

ఆ రోజు చెలికత్తెలందరూ తనని చూస్తూ నవ్వుతూ వేళాకోళాలాడినా రాత్రి జరిగిన విషయంలో కొట్టవచ్చిన ప్రత్యేకతగానీ, సంతృప్తిగానీ తనలో ఏర్పడలేదు. ఇది గమనించిన చెలికత్తెలు అలాంటి సంభాషణలు మానివేశారు. ఒక ముసలిదాసి ఏదో మాటాడబోయి కళ్ళు తుడుచుకుంది.

అప్పటినుండీ తనకి యాంత్రిక

జీవితం, ఈ గవాక్షం, ఈ పువ్వులూ మిగిలి పోయాయి. మరునటి సంవత్సరంలో దశరథుడు తన దగ్గరకు రాలేదు. అతను చేసిన యాగాల వల్లో, పెద్ద ప్రయత్నాలవల్లో, కొడుకులు లేని అతని పెద్దరాణులు ముగ్గురికీ నలుగురు కొడుకులు పుట్టారు. అందుకు జరిపే వేడుకలలో మునిగి పోయిన రోజుల్లో తన వంతు రోజు రావడం వల్ల రాలేకపోయాడు. ఈ ఒక్క సంవత్సరంలో తనలో వచ్చిన మార్పో, ఏమో కానీ, అందుకు నిశ్చయ రూపం లేని అస్పష్టమైన బాధేదో తనలో కలిగింది.

ఆ తర్వాత ఎప్పుడూ దశరథుడు తనదగ్గరికి రాలేదు. 'వంతురోజులు' ప్రతి ఏడాదీ వస్తూనే వున్నాయి. బహుశ అతని ముసలితనం పూర్తిగా నిర్వీర్యుణ్ణి చేసిందేమో. ఇది తనకి భయంకరమైన ఆలోచన. లేక అతని కొడుకుల మీద శ్రద్ధ ఎక్కువై (వారిపై అతనికి అవ్యాజానురాగమని తనకి చెలికత్తెలు చెప్పారు) తీరికలేక రాకపోవచ్చు. దశరథుని కొడుకులని తను చూసింది. ఏదో పండగనాడు ఉదయం, నదిలో స్నానం చేసి రథంలో వస్తూ ఉండగా, రాజవంశీకుల శిక్షణ మైదానంలో వారు ఆయుధాల కవాతు చేస్తున్నారు. అందులో ఒక కుర్రవాడు తనకి పానీయం అందించడంలో అయినఆలస్యానికి సేవకుడిని కొడుతూ వుంటే మిగిలిన ముగ్గురు పిల్లలూ, రాజవంశీకులకు సహజమైన దర్పంతో చూస్తున్నారే తప్ప కలగ చేసుకోవడం లేదు. తను అంతఃపురానికి వచ్చేసింది. ఆ తర్వాత వాళ్ళు పెద్దవాళ్ళవడం, పెళ్ళి అవడం కూడా తను చూసింది. దశరథుని పెద్ద కొడుకు ఏకపత్నీ వ్రతుడట. ఇది దశరథునికి వ్యక్తిగతంగా యిష్టంలేకపోవచ్చు. పోనీ యీ రాత్రయినా తన మందిరానికి వస్తాడేమో!

"రాణీ మందాకినీదేవీ, వైద్యుని పిలిపించాను ప్రవేశ పెట్టమంటారా?" చెలికత్తె తలుపు తెరచుకుని వచ్చింది

"వద్దు! స్వస్థతగానే ఉంది" అంది రాణి.

"అయితే భోజనం ఏర్పాట్లు చేయమంటారా?"

"వద్దు! ఈ రోజు భోజనం చెయ్యను."

చెలికత్తె తలుపువేసి వెళ్ళి పోయింది.

రాణి పాత్రలోని మదిరతాగింది. వైద్యుని పిలిపించడం ఆవిడకి చాలా అసహ్యకరంగానూ, నవ్వులాటగానూ కనిపించింది. అంతఃపురాల్లో ఉండే పురుష భృత్యవర్గంలాగే ఈ వైద్యుడు కూడా ముసలివాడు. ఇతను తనకి మందు వెయ్యగలడా? చాలాకాలం ఎంతో ఆశతో ఎదురు

చూసిన విషయం అందుబాటులోనికి రానప్పుడు కలిగే భయంకరమైన నిర్లిప్తతే తన కేర్పడింది. ఎన్నాళ్ళీ ఎదురుచూపు? ఈ చూడడం ఎవరి కోసం? అందుబాటులో ఉండే వ్యక్తి అనగ్వాడు ఇప్పుడా అవకాశం కూడా లేదు ఆ పువ్వుల్లాగే తనూ రాలిపోతుందా? ఈ ఆశ ఎంత హాస్యాస్పదమైనా యీ రాత్రైనా దశరథుడు వస్తాడేమో!

రాణి ఇంకాస్త మదిర త్రాగింది.

అయినా తన జీవితంలో ఇంకేం ఆదర్శం లేదా? ఇంకేం బాధ్యతా లేదా? ఈ శరీరాన్ని ఎవరికి వ్వాలి అనే ప్రశ్న తప్ప సామాన్య జీవితాన్నెదుర్కొనే ఇంకో సమస్యే లేదా? ఇదే రాణీ అయిన తనకుండే సౌఖ్యమా? ఈ మెత్తటి పరుపులూ, బంగారు పాత్రలూ, చెలికత్తెలు, పంచభక్ష్యాలూ లేని యింకే మారుమూల అరణ్యంలోనైనా ఇంతకన్నా ఆనందవంతంగా బ్రతకవచ్చేమో!

రాణీ మరికాస్త మదిర త్రాగింది,

ఇలాంటి ఫలించని జీవితాన్నుండి, యీ కుళ్ళు వాతావరణం నుండి బయటపడటమెలా? చనిపోవడం మంచిదేమో! తను చనిపోతే బహుశ యీ లోటు మరో స్త్రీతో, తనకన్నా యువ్వని, తనకన్నా సౌందర్యవతి, సుకుమారి అయిన మరో స్త్రీతో పూడ్చబడుతుంది. అవును. ఇదేం పవిత్రత ఆపాదించవలసిన స్థానం కాదు. శాశ్వతమైన సంబంధం కలదీ కాదు. రాజ్యంలో చాలా ఉద్యోగులవలె తనూ ఒక ఉద్యోగిని. ఈ రాజు యొక్క ఘనతని పెంచే అనేకమైన యిలాంటి స్థానాలను ఆక్రమించటం తప్ప ఇంకే విధమైన వ్యాపారమూ చేయలేని ఉద్యోగిని.

రాత్రి చాలా గడిచిపోయింది. తనకి ఆశపోలేదు. దశరథుడు ఇంకా వస్తూ ఉండచ్చు. మెల్లిగా వచ్చి ఆసనంలో కూర్చుంది రాణి.

ఇంతట్లోకే గబాలున తలుపుతీసి చెలికత్తె లోపలికి వచ్చి 'రాణీ! దశరథమహారాజు కైకేయి రాణి అంతఃపురంలో గుండె పగిలి చచ్చిపోయాడు' అంటూ గాభరాగా చెప్పి, రాణీకి దుఃఖంలో వచ్చే తానూహించిన కోపానికి భయపడి వెళ్ళిపోయింది.

'చచ్చిపోయాడా! చచ్చిపోయాడా!' అని రాణి మందాకినీదేవి నిశ్చేష్టురాలయి పోయింది. అకస్మాత్తుగా రాణి దృష్టి తోటలోని ద్వారపాలకునిపై పడింది. దిగ్గున లేచి చప్పట్లు చరిచి గవాక్షంగుండా అతన్ని పిలిచింది. అతడు పరిగెడుతూ కిటికీ వద్దకు వచ్చి భయ

తీడుతూ, వినయంగా నుంచున్నాడు. రాణి అతన్ని దగ్గరగా పిల్చి అతని చేతిని పట్టుకుని 'నువ్వు నన్ను నీతో ఎక్కడికైనా తీసుకుపోతావా? ఏ అరణ్యాల్లోకో, కొండల్లోకో' అంది.

వణుకుతూ ఉన్న ద్వారపాలకుని నోట మాటరాలేదు.

'చెప్పు, నా నగలన్నీ పట్టుకు వస్తా, తీసుకుపోతావా?'

'నా తల తీసేస్తారమ్మగారూ, నన్ను బతకనివ్వరమ్మగారూ, క్షమించండమ్మా; నాకిలాంటి మాటలు చెప్పకండమ్మా, చచ్చిపోతానమ్మా, క్షమించండమ్మా' అంటూ గాభరాగా వణుకుతూ అతను పారిపోయాడు, బాధను గురించి నిశ్చయం చేసుకుని.

రాణి కళ్లనిండా నీళ్లు పొంగుకు వచ్చాయి. అపుకోలేని దుఃఖంతో చేతులు నిస్సహాయంగా కిటికీలో వేలాడ దీసింది. పేలవంగా నిలబడి పోయింది. వెంటనే ఏదో నిశ్చయం చేసుకున్నట్టు వ్రేలికి ఉన్న విషపుటుంగరాన్ని మ్రింగి నమిలింది.

● ● ●

రాణి మందాకినీ దేవి చని పోయింది. అందరూ ఘనంగా చెప్పుకున్నారు: ఆమె సౌశీల్యాన్ని గురించి, దశరథునిపట్ల ఆమె ప్రేమ గురించి, ఆత్మహత్యకు దారి తీసిన ఆమె పాతివ్రత్యాన్ని గురించి.

□□□

---

● రాజుగారు పరివారంతోసహా అడవికి వేటకు బయల్దేరారు. చాలాదూరం పోయాక వున్నట్టుండి ఆయన గుర్రానికి జబ్బుచేసి కూలబడిపోయింది. ఆ దగ్గర్లోవున్న గ్రామంలో వాకబు చేయగా ఇద్దరు పెద్ద రైతులకి చెరో గుర్రం వున్నట్టు తెలిసింది. రాజుగారు వాళ్ళకి కబురు చేయగా వాళ్ళు గుర్రాలతోసహా వచ్చారు. కాని, అవి వట్టి దండగమారి గుర్రాలని, పరిగెత్తలేవని వాళ్ళు మనవి చేసుకున్నారు.

గుర్రా లివ్వడం ఇష్టంలేకనే వాళ్ళు సాకు చెబుతున్నారని రాజుగారు గ్రహించారు. రెండు గుర్రాలకి పందెంపెట్టి ఏది బాగా పరిగెడితే అది తీసుకుంటామన్నారు.

"లాభంలేదు ప్రభూ! వాళ్ళు గుర్రాల్ని సరిగా పరిగెత్త నివ్వరు." అన్నాడు సేనాని రాజుగారి చెవిలో.

"మా బాగా పరిగెత్త నిస్తారు. ఒకళ్ళ గుర్రాన్ని మరొకళ్ళని ఎక్కమను" అన్నాడు రాజుగారు.